



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :211 25 గురువారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి



- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం- పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది- జామ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్,జూన్24 (ప్రజా వీక్షణం)

ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. మిగతా 2 లో

## ఉక్రెయిన్‌కు భారత సైన్యాన్ని పంపాలని వాన్స్ ప్రతిపాదన..

- ఉక్రెయిన్‌లో భారత దళాలపై అమెరికాలో చర్చ
- జేడీ వాన్స్ భారత్ పేరును ప్రతిపాదించినట్లు వెల్లడి
- ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించినట్లు పుస్తకంలో ప్రస్తావన
- “భారతీయులు అలాంటి పని చేయరు“ అని ట్రంప్ వ్యాఖ్య
- ఉక్రెయిన్‌పై శాంతి చర్చలకే భారత్ మద్దతు

(ప్రజా వీక్షణం)

ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల సమయంలో భారత సైన్యాన్ని శాంతి పరిరక్షక దళంగా పంపాలన్న ప్రతిపాదన ఓ దశలో అమెరికా అత్యున్నత స్థాయిలో చర్చకు వచ్చినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. మిగతా 2 లో



## కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్..

- ఫ్యామిలీకి హాయ్, హార్ట్ సింబల్!

- ట్యాంజెడ్‌కో కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి
- కార్యక్రమంలో ఉద్యోగులతో సరదాగా ముచ్చటించిన ముఖ్యమంత్రి

(ప్రజా వీక్షణం)



ఒకరి ఫ్యామిలీకి ‘హాయ్‘ చెప్పి, మరొకరికి ‘హార్ట్‘ సింబల్ చూపించిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఒక అధికారిక కార్యక్రమాన్ని తనదైన శైలిలో ఎంతో ఉత్సాహంగా, చిరస్మరణీయంగా మార్చారు. మిగతా 2 లో

## డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి




- ఒలంపిక్ రన్ ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్ రావు

సిద్దిపేట,జూన్24 (ప్రజా వీక్షణం)

డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశా ముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. మిగతా 2 లో

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

- కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం- సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

ఖమ్మం,జూన్24 (ప్రజా వీక్షణం)

రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వ కుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుం టున్నారని తెలిపారు.




## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

- రేషన్ నిరాకరణపై సుప్రీం ఆశ్చర్యం

న్యూఢిల్లీ,జూన్24 (ప్రజా వీక్షణం)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధ వారం విచారణ జరిగింది. ఎస్ఐ ఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది.




## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచాలు



- బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

ఖమ్మం,జూన్24 (ప్రజా వీక్షణం)

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు.బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. మిగతా 2 లో

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ,జూన్24 (ప్రజా వీక్షణం)

శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మిగతా 2 లో



## పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం

- జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టుకు శ్రీకారం
- ప్రైవేట్ రంగంలో బంగారం గనుల తవ్వకం ప్రారంభం- తొలి ఏడాదిలో 400 కిలలో బంగారం ఉత్పత్తి లక్ష్యం- సుమారు 700మందికి ఉద్యోగావకాశాలు- రాయలసీమ అభివృద్ధికి కీలకమని ప్రకటించిన చంద్రబాబు



కర్నూలు,జూన్24 (ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు. జొన్నగిరి ప్రాజెక్టుకు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ సంస్థలు ఇప్పటి వరకు రూ.405 కోట్లు వెచ్చించాయి. మిగతా 2 లో

GENERAL NEWS

25 గురువారం, జూన్ 2026

2

www.prajaveekshanam.in

ప్రజావీక్షణం దినపత్రిక

ప్రజావీక్షణం దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

## సంపాదకీయం

# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం !

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకలను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాలను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగడుగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు పక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు.

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

మొదటిపేజీ తరువాయి

ఎస్ఐఆర్ పక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ పక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌కు భారత సైన్యాన్ని పంపాలని వాన్స్ ప్రతిపాదన..

మొదటిపేజీ తరువాయి

అయితే ఆ ఆలోచనను అధ్యక్షుడు ట్రంప్ వెంటనే పక్కన పెట్టినట్లు తాజాగా విడుదలైన ఓ పుస్తకం వెల్లడించింది.అమెరికా జర్నలిస్టులు మ్యాగీ హాబర్‌మన్, జోనాథన్ స్వాన్ రాసిన 'రెజీమ్ ఛేంజ్: ఇన్‌సైడ్ ది ఇంపీరియల్ ప్రెసిడెన్సీ ఆఫ్ డొనాల్డ్ ట్రంప్' పుస్తకంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన కొన్నిరోజులకే వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.ఆ సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆసక్తికరమైన సూచన చేసినట్లు పుస్తకం చెబుతోంది. ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ అమలైతే అక్కడ శాంతి పరిరక్షణ కోసం యూరప్‌కు వెలుపల ఉన్న దేశాల సైన్యాన్ని వినియోగించవచ్చా? అని ఆయన ప్రశ్నించినట్లు రచయితలు పేర్కొన్నారు. ఆ సందర్భంలో భారత్ పేరును కూడా ఆయన ప్రస్తావించినట్లు తెలిపారు.అయితే ఈ ప్రతిపాదనపై ట్రంప్ నవ్వుతూ స్పందించినట్లు పుస్తకంలో ఉంది. "భారతీయులు అలా చేయలేరు. అలాంటి వ్యవహారాల కోసం ఖర్చు పెట్టరు" అని ఆయన వ్యాఖ్యానించినట్లు రచయితలు పేర్కొన్నారు. అదే సమయంలో ప్రధాని మోదీతో తనకు ఉన్న స్నేహాన్ని కూడా ట్రంప్ ప్రస్తావించినట్లు పుస్తకం వెల్లడించింది.ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ మొదటి నుంచీ ఒకే విధమైన వైఖరిని కొనసాగిస్తోంది. యుద్ధానికి బదులుగా చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పదేపదే చెబుతోంది. 'ఇది యుద్ధాల యుగం కాదు' అని ప్రధాని మోదీ పలుమార్లు స్పష్టం చేశారు. అయితే ఉక్రెయిన్‌కు భారత సైన్యాన్ని పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. అయినా ఈ అంశం భారత్‌లో కూడా చర్చకు వచ్చింది. 2025 ఏప్రిల్‌లో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ కాల్పుల విరమణ అమలైతే పరిమిత స్థాయిలో శాంతి దళాలను పంపే అవకాశాన్ని పరిశీలించవచ్చని అభిప్రాయపడ్డారు. యూరప్ వెలుపల ఉన్న దేశాలు కూడా శాంతి పరిరక్షణలో పాత్ర పోషించవచ్చని ఆయన అన్నారు.ప్రపంచవ్యాప్తంగా శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లో భారత సైన్యానికి విశేష అనుభవం ఉంది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో దక్షిణ సూడాన్, సోమాలియా, లెబనాన్ వంటి దేశాల్లో భారత బలగాలు గతంలో సేవలందించాయి. అయినప్పటికీ ఉక్రెయిన్ విషయంలో అలాంటి ప్రతిపాదన ఎప్పుడూ చర్చకు రాలేదు.

# ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

మొదటిపేజీ తరువాయి

ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్‌లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు. ఎప్పుడు కూడా చైనా ఒలింపిక్స్‌లో మొదటగా వచ్చేదని.. మనం మాత్రం కింది స్థానంలో ఉండే వాళ్లమని వెల్లడించారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలు అలవాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా మన దేశానికి కావాల్సింది భగవద్గీత పుస్తకాలు కాదని.. క్రీడా మైదానాలు కావాలని అన్నారు. మన దేశంలో ఉన్నా క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం

మొదటిపేజీ తరువాయి

ప్రయోగాత్మకంగా చేసిన ఉత్పత్తి పక్రియ విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి చేసే పక్రియను సీఎం ప్రారంభించారు. ప్రైవేటు రంగంలో బంగారం గనుల తవ్వకం, ఉత్పత్తి చేసే పక్రియ ప్రారంభం కావడం దేశంలోనే ఇది మొట్టమొదటిసారి. ప్రపంచంలో బంగారం గనులు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా జొన్నగిరికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. ఏటా రెండు టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసేలా జియోమైసూర్ సంస్థ ప్రణాళికలు రచించింది. ఇక్కడ 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఉత్పత్తి చేసిన బంగారం విలువపై నాలుగుశాతం రాయల్టీ లభించనుంది. తొలి ఏడాది 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్న నేపథ్యంలో సుమారు రూ.57 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కర్నూల్ జిల్లాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఏపీ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంలో అత్యంత కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏపీలో పారిశ్రామిక వృద్ధికి, మైనింగ్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక కొత్త దిక్సూచిగా మారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనుంది. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలు, ప్రత్యేకతల వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఏడాదికి 400 కేజీల బంగారు ఉత్పత్తితో మైనింగ్ ప్రారంభం కానుంది. తదుపరి కాలంలో దీనిని ఏడాదికి 900 కేజీలకు పెంచుతారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలోకి వచ్చాక ఏడాదికి ఏకంగా 2 టన్నుల బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో వాడే అత్యంత భారీ వాహనాలను సురక్షితంగా నడిపేందుకు వీలుగా 'సిమ్యులేటర్ యంత్రాల' సహాయంతో స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా సందర్శించి, అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు జెండా ఊపి ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను ప్రారంభించారు.

# కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్..

మొదటిపేజీ తరువాయి

బుధవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో 'ట్యాంజెడ్‌కో' (విద్యుత్ బోర్డు)కు కొత్తగా ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు కోరిన సరదా విన్నపాలను ఆయన మన్నించి అక్కడి వారందరినీ ఆకట్టుకున్నారు.తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రాష్ట్ర విద్యుత్ శాఖకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి విజయ్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఒక నూతన ఉద్యోగి తన కుటుంబ సభ్యులకు 'హాయ్' చెప్పాలని కోరగా, విజయ్ చిరునవ్వుతూ కెమెరా వైపు చూసి అభివాదం చేశారు.మరొక అభ్యర్థి 'హార్ట్ సింబల్' చూపించమని కోరగా, ఆయన ఆ విన్నపాన్ని కూడా తీర్చారు. దీంతో సభ ప్రాంగణమంతా చప్పట్లు, కేరింతలతో సందడిగా మారింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించారు.

# పలు వార్డుల్లో మునిసిపల్ కమీషనర్ విస్తృత పర్యటన





**బాపట్ల : జూన్ 24 (ప్రజా వీక్షణం)**

బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మునిసిపల్ కమీషనర్ మామిళ్లపల్లి హాసిని విస్తృతంగా పర్యటించారు. బుధవారం ఉదయం పలు వార్డులలో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్యం, పచ్చదనం, డ్రైనేజీ సమస్యలు, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పెయింటర్స్ కాలనీలోని మునిసిపల్ పార్కును సందర్శించిన కమీషనర్ పార్కులో పచ్చదనాన్ని నిరంతరం పరిరక్షిస్తూ మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎస్.ఎస్.ఆర్.కృష్ణారెడ్డి ని ఆదేశించారు. పార్కును ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా అవసర మైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం విజయలక్ష్మిపురంలో పారి శుద్ధ్య పనులను పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ప్రతి రోజు వార్డుల్లో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి చెత్త సేకరణను తప్పని సరిగా నిర్వహించాలని, ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త మరియు హానికర వ్యర్ధాలను వేర్వేరుగా అందించేలా అవ గాహన కల్పించి, వేరు చేసిన చెత్తను మాత్రమే సేకరించాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తదుపరి డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ మార్గ్ లోని డీఎస్పీ కార్యాలయం వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను డీఎస్పీ చంద్రమౌళితో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో దీనిపై పరిశీలించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ను కమీషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు తెలుగు దేశం పార్టీ కార్యాలయం పక్కన గల రోడ్డును కమీషనర్ పరిశీలించారు. రోడ్డు మార్జిన్ లో గత కొంతకాలంగా నిరూపయోగంగా ఉండి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలను స్థానికులు కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కమీషనర్ సంబంధిత అధికారులను మరియు సిబ్బందిని సమన్వయం చేసి ఆ నిరుపయోగ విద్యుత్ స్తంభాలను అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎస్.ఎస్.ఆర్. కృష్ణారెడ్డి మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ యువ నాయకుడు కుమార్ రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

**శ్రీరామవరం జూన్ 24(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలం, ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, బూత్ నెంబర్ 90 ఇంచార్జ్ కాల్నీడి కుమార్ రాజా జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ... కుమార్ రాజా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజా సేవలో నిరంతరం ముందుండాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడంలో యువతరం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని కుమార్ రాజాకు శాలువాలు కప్పి, పూలమాలలతో పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.



# బంగారం మెరుగు పేరుతో మోసాలు: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - బీహార్‌కు చెందిన ఆరుగురు ముఠాపై అనుమానాలు

## - మోసపోవద్దని ఉంగుటూరు పోలీసుల హెచ్చరిక






**ఉంగుటూరు జూన్ 24 (ప్రజా వీక్షణం):**

బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామంటూ ఇళ్లపైకి వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కృష్ణా జిల్లా ఉంగుటూరు పోలీసులు హెచ్చరించారు. అమాయక ప్రజలను నమ్మించి, వారి నగలను కాజేస్తున్న ఒక ముఠాపై పోలీసులు నిఘా పెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఈ మోసాలకు పాల్పడుతున్నారు. ఇళ్ల వద్దకు వచ్చి బంగారు నగలకు ఉచితంగా లేదా తక్కువ ధరకే మెరుగు (పాలిష్) పెడతామని వీరు నమ్మబలుకుతారు. ఆపై ఆభరణాలను ఒక ప్రత్యేకమైన రసాయన వేడి నీటి ద్రావణంలో ముంచే ప్రక్రియలో... ఎవరికీ తెలియకుండా కొంత బంగారాన్ని కరిగించి దొంగిలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నగలను బయటకు తీసి చూసేసరికి వాటి బరువు తగ్గిపోవడంతో బాధితులు మోసపోయామని గ్రహిస్తున్నారు. అలాగే ప్రజలు అపరిచితుల మాయ మాటలను నమ్మి తమ బంగారు ఆభరణాలను వారి చేతికి ఇచ్చి మోసపోవద్దు. మీ పరిసరాల్లో ఇలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి అని ఉంగుటూరు పోలీస్ యంత్రాంగం తెలిపింది. ఇలాంటి తరహా మోసాలు ఎక్కడైనా జరిగి ఉంటే బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు. గతంలో ఇలాంటి ఘటనలకు సంబంధించి కేసులు నమోదైనా, లేదా సమాచారం తెలిసినా తమకు అందించాలన్నారు. ఈ ముఠాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా లేదా ఫిర్యాదులు చేయాలనుకున్నా.. ఉంగుటూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ యు. గోవిందును 9440627043 నంబర్‌లో సంప్రదించవచ్చని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# నాగారం హైస్కూల్‌లో డ్రగ్స్ అవగాహన సదస్సు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా వారి భవిష్యత్తు ను కాపాడేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హసన్ పర్తి మండలంలోని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. 'ఈగిల్ ఫోర్స్ తెలంగాణ' ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సంద ర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, ఎస్సై గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితానికి ఎంతో కీలకమైందని, ఈ వయసులో డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా ఉజ్వల మైన భవిష్యత్తు అంధకార మవుతుందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి విద్యార్థి బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాల ని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1908 లేదా వాట్సాప్ నంబర్ 8712685015కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో "సే నో టు డ్రగ్స్ సే ఎస్ టు లైఫ్" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీసు సిబ్బంది, విద్యార్థు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కొరివి రామన్నపాలెం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

## - దాతృత్వాన్ని చాటుకున్న ఎన్ఆర్ఐ గాది రాంప్రసాద్ కుటుంబం

## - ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ టి. రామ్మూర్తి

**టి. నరసాపురం, జూన్ 24:(ప్రజా వీక్షణం)**

అన్ని దానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని, విద్యార్థుల చదువును ప్రోత్సహించే గుణం సమాజంలో ఇతరులకు స్ఫూర్తిదాయకమని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) టి. రామ్మూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొరివి రామన్న పాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టి. నర్సాపురం గ్రామానికి చెందిన ప్రముఖులు గాది అప్పారావు కుమారుడు, ప్రస్తుతం సింగపూర్‌లో స్థిరపడిన ఎన్ఆర్ఐ గాది రాంప్రసాద్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ రామ్మూర్తి మాట్లాడుతూ.. ఒక మనిషి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్య, విద్యా సౌకర్యాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందించిన గాది అప్పారావు కుటుంబ సభ్యుల దాతృత్వాన్ని, సేవా గుణాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మండల పరిధిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను సమన్వయం చేస్తున్న సామాజిక కార్యకర్తలను ఆయన ప్రశంసించారు. ఇదే వేదికపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సయ్యద్ నాజ్‌నీన్ పుట్టినరోజు



వేడుకలను కూడా నిర్వహించారు. ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని నాజ్‌నీన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ విద్యా, సేవా కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు ఎస్.డి. నాసర్ పాషా, కొరివి శేషారావు, కొరివి నాగేశ్వరావు, పింగుల మధు, తాడిగడప జయరాజులతో పాటు పాఠశాల కమిటీ చైర్మన్ దేవునిపల్లి రేవతి, ప్రధానోపాధ్యాయులు పి. భాస్కర్, ఉపాధ్యాయురాలు కే. అరుణకుమారి, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విస్తరించిన నైరుతి వారంపాటు జోరు వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్,జూన్24 (ప్రజా వీక్షణం)**

నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ అంతటా విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. నారు వేసుకోవడం ఆలస్యం అవుతోందని అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది కాస్త మందకొడిగా సాగిన పవనాలు.. జూన్ 8న రాష్ట్రాన్ని తాకినప్పటికీ, తెలంగాణను పూర్తిగా కమ్మేయడానికి దాదాపు 15 రోజుల సమయం తీసుకున్నాయి. ఈ ప్రభావంతో సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఏకంగా 17.1 సెం.మీల వాన పడింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం. హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా.. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో వానలు దంచికొట్టాయి. వీటితో పాటు సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పగటిపూట కూడా వర్షాలు ఊపందుకున్నాయి. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు జోరుగా సాగనున్నాయి. ఆ మరుసటి రోజు (25వ తేదీన) ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

# స్వల్పంగా దిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,జూన్24 (ప్రజా వీక్షణం)**

బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మెల్లగా దిగి వస్తున్నాయి. అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,44,330గా ఉంది.

# విద్యార్థులకు భోజనం ప్లేట్లు,గ్లాసులు అందించిన రజని

**బాపట్ల : జూన్ 24 (ప్రజా వీక్షణం)**

బాపట్ల మండలం రామ్ నగర్ నందు ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడీ పాఠశాలలో సమాజ సేవకురాలు బంద్రెడ్డి రజని విద్యార్థులకు భోజనంకు ఉపయోగపడే ప్లేట్లు మరియు గ్లాసులను అందజేశారు.అదే విధానం అంగన్వాడీ పాఠశాలలో పని చేసే ఆయాలకు చీరలను అందించారు.ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ...విద్యార్థులందరు బాగా చదువుకోవాలని అన్నారు. పెద్దలను గౌరవించాలని,సేవా దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు,ఉపాధ్యాయులు బాబురావు,అంగన్వాడీ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.





# మాగల్లులో వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవాలు, మహా కుంభాభిషేక మహోత్సవాలు!

**మాగల్లు, జూన్ 24 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం, నందిగామ మండలం మాగల్లు గ్రామంలో సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవములు మరియు మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.గ్రామంలో నూతనంగా నిర్మితమైన 108 అడుగుల అత్యంత ఎత్తైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో ప్రతి సంవత్సరం పౌర్ణమి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్వామివారి ఆలయ శిఖరానికి రంగులు అద్ది, పరిపూర్ణమైన రీతిలో నిర్వహించే మహా కుంభాభిషేకం ఈ ఏడాది జరగనుంది. ఆలయ నిర్మాణమై 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఇది రెండవ మహా కుంభాభిషేక మహోత్సవం కావడం విశేషం.ఈ మహోత్సవాలకు సంబంధించిన వివరాలను సేవ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు.

**ఐదు రోజుల పాటు విశేష హోమాలు**

**పూజా కార్యక్రమాలు**

నేడు (గురువారం, జూన్ 25) ఏకాదశి పర్వదినం నుండి స్వామి వారి స్నాపన తిరుమంజన అభిషేకంతో ఈ ఐదు రోజుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజు ఉదయం 10:30 గంటలకు ఆలయంలో విశేష హోమాలు జరగనున్నాయి:

- జూన్ 25 (గురువారం): మహా సుదర్శన హోమం
- జూన్ 26 (శుక్రవారం): లక్ష్మీ హోమం
- జూన్ 27 (శనివారం): ప్రత్యంగిరా పరాశక్తి హోమం
- జూన్ 28 (ఆదివారం): అష్టముఖ గండభేరుండ బడబానల జ్వాలా లక్ష్మీనరసింహా హోమం

(సాయంత్రం వేళల్లో గజవాహన సేవ, గరుడవాహన సేవ మరియు వైభవంగా రథోత్సవ సేవలు నిర్వహించబడతాయి).

**జూన్ 29న హంపి పీఠాధిపతులచే 'మహా కుంభాభిషేకం'**

ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన మహా కుంభాభిషేకం జూన్ 29వ తారీకు సోమవారం ఉదయం 10:30 గంటలకు జగద్గురు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీ స్వామి (హంపి పీఠం) వారి పర్యవేక్షణలో, వారి దివ్య హస్తాల మీదుగా శాస్త్రోక్తంగా జరగనుంది.

–ఔషధ జలాలతో కుంభాభిషేకం:లిఈ కుంభాభిషేకం కోసం భారతదేశంలోని 9 పుణ్య నదుల (జీవనదుల) పవిత్ర జలాలను కలశాలలో నింపి, వాటికి ప్రత్యేకమైన ఔషధ గుణాలు కలిగిన మూలికలను జతపరిచారు. ఈ పవిత్ర జలాలను మూడు రోజుల పాటు కుంభాలలో ఉంచి, శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం స్వామివారికి అభిషేకం చేయనున్నారు.

మహా కుంభాభిషేకం అనంతరం పూర్ణాహుతి, ఆ తర్వాత భక్తులందరికీ భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుంది.



**భక్తులకు నిర్వాహకుల పిలుపు**

ఈ ఐదు రోజుల పాటు జరిగే విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ వంతు సహకారాన్ని అందించి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని సేవ ట్రస్ట్ ప్రతినిధులు భక్తులను కోరారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

# పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర జూన్ 24 ప్రజా విక్షణం**

నియోజకవర్గ పరిధిలో భూత్పూర్ మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో బుధవారము శివాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన మరియు ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, పాల్గొని పూజలు చేశారు. తదుపరి ఐదు లక్షల రూపాయల నిధులతో ఆలయంలో షెడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఆలయ అభివృద్ధి కోసం తాను అన్ని విధాల కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# అంగన్వాడిలో దుస్తుల పంపిణీ

**దేవరకద్ర జూన్ 24 ప్రజా వీక్షణం**

మహబూబ్నగర్ మండల పరిధిలోని రామచంద్రాపూర్ గ్రామంలో అంగన్వాడి ఒకటొవ సెంటర్ లో చిన్నారులకు బుధవారం ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను గ్రామ సర్పంచ్ వై నర్సిములు (బాబురావు) పంపిణీ చేయడం జరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా చిన్నారులకు వినూత్న పథకాలు మరియు కార్యక్రమాలతో చిన్నారులు అంగన్వాడి పాఠశాలకు అలవాటు పడేలా చేస్తున్నందుకు ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి,కి ధన్యవాదాలు తెలియజేసినారు ఈ యొక్క కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పి. శోభారాణి చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**దేవరకద్ర జూన్ 24 ప్రజా వీక్షణం**

నియోజకవర్గంలో భూత్పూర్ మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో బుధవారం కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆదిత్యాది నవగ్రహ పూర్వక నాభి శిల సహిత ఆలయ శిఖర ధ్వజస్తంభం ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర రెడ్డి, పాల్గొని భక్తితో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికై తాను అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెనుక మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రైతులకు అందుబాటులో విత్తనాలు

**దేవరకద్ర జూన్ 24 ప్రజా వీక్షణం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలో దేవరకద్ర, గోపనపల్లి, లక్ష్మీపల్లి, గ్రామాలలో ఉన్న రైతు వేదిక భవనంవద్ద ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలు నూనె గింజలు, కందులు నానో యూరియా మరియు నానో డి ఏ పి యూరియా రైతు సోదరులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాజేంద్ర అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.





# నూతన ఎస్సై ని సన్మానించిన కురువ యాదవ సంఘం నాయకులు

**దేవరకద్ర జూన్ 24 ప్రజా వీక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన భాస్కర్ రెడ్డిని, బుధవారము దేవరకద్ర మండల కురువ యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. శాంతి భద్రతల కోసము తాము అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.





# దేవస్థానం ఈవోను సన్మానించిన మాజీ పాలకమండలి సభ్యులు

**దేవరకద్ర జోన్ 24 ప్రజా విక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవాలయానికి నూతనంగా ఈవోగా శివానంద చారిని బుధవారము పదవి గౌని రాము,గౌని శ్రీనివాసు, నాగేషు, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కౌకుంట్ల నాగేశ్వరరావు, ఆలయఅర్చకులు నాగరాజు, నాగభూషణం, సిబ్బంది వారు శాలువాతో ఘనంగా సన్మానించారు.







# వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు విప్పర్తి రాంబాబు మృతి

## - కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**పోలవరం, జూన్ 24 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు విప్పర్తి రాంబాబు ఇటీవల కన్ను మూశారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్సీపీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ప్రగడపల్లిలోని రాంబాబు నివాసానికి చేరుకుని, ఆయన భౌతికకాయానికి నివాళు లర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ, రాంబాబు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ... ఈ కష్టసమయంలో పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని, ఏ అవసరం వచ్చినా తోడుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రాంబాబు కుటుంబానికి అందరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీటీసీ దాపర్తి మోహనరావు, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బుగ్గ మురళి అలాగే స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు ప్రగడపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాంబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆయన కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.



# బోధంపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ బోధంపల్లి గ్రామంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ (వి సి ఎఫ్) ఆధ్వర్యంలో రైతుల కోసం అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి రమేష్ గారు, గ్రామ పెద్దలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో వి సి ఎఫ్ ప్రోగ్రామ్ అసోసియేట్ గజానంద్ గోండ్ గారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో (జుశ్రీ చీతేశీ) ప్రభావం, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు వాటిని అధిగమించే సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పత్తి ఆధారిత 6:1 మరియు 1:1 పప్పుధాన్యాల అంతర పంటల నమూనా (Intercropping Model) గురించి వివరించారు. ఈ విధానం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అలాగే రైతులకు కందులు, పెసర, మినుముల విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల కూలీ ఖర్చులను తగ్గించేందుకు అన్ని రకాల విత్తనాలు వేయడానికి అనువైన అగ్రికల్చర్ హ్యాండ్ పుష్ సీడర్ యంత్రం వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ యంత్రాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉంచడం జరిగింది జరిగింది ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిం చారు. కార్యక్రమంలో గోమాసి రాజేశ్వరి గారు, కమిటీ సభ్యులు నాందేవ్ గారు, లింగయ్య గారు, కుమార్ గారు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు పెంటయ్య , శంకర్, కార్తీక్, ప్రభాకర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతుల ఆదాయ భద్రత, వాతావరణ అనుకూల వ్యవసాయం మరియు స్థిరమైన వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను రైతులు అభినందించారు.




# కీసరలో 116 మందికి 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

## - పేదల జీవన ప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - ఉచిత కనెక్షన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య





**కంచికచర్ల (కీసర), జూన్ 24 (ప్రజా వీక్షణం):**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో బుధవారం 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' పథకం కింద ఎంపికైన 116 మంది అర్హులైన లబ్ధిదారులకు ఆమె ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. స్థానిక అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆమె ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. పొగచూరిన వంటగదుల నుంచి మహిళలకు విముక్తి కల్పించి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వంట చెరకు వాడకం వల్ల మహిళలు ఎదుర్కొంటున్న తీవ్ర ఆరోగ్య సమస్యలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అత్యంత విజయవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు. అర్హతే ప్రాతిపదికగా ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. తంగిరాల సౌమ్య, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా, సమన్వయంతో అమలు చేస్తున్న ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని ఆమె అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 24 (ప్రజా వీక్షణం)**

భారతదేశాన్ని, హిందూ ధర్మాన్ని కాపాడిన మహా యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నామని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు . తాడేపల్లిగూడెం పట్టణానికి గర్వకారణంగా భావించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కూడలికి చత్రపతి శివాజీ కూడలిగా నామకరణం చేస్తున్నామని తెలియజేశారు. ఉండి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ వినోద్ వర్మ, ఆర్డీఓ ఎం సూర్యారావు, తహసిల్దార్ రాజరాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.






# సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి నూతన కార్యనిర్వహణ అధికారిగా శివానంద చారి

**దేవరకద్ర, జూన్ 24 ప్రజా విక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీలోని సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థాన నూతన కార్య నిర్వహణ గ్రేట్ 2 అధికారిగా శివానంద చారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శివానందా చారి ఇంతకుముందు తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తించి, దేవరకద్ర మున్సిపాలిటి లో సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో కారణ నిర్వహణ అధికారి గ్రేట్ 2 గా పదోన్నతి పొంది, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన సిబ్బంది , భక్తులు, ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థాన అభివృద్ధి ,భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో కృషి చేస్తానని శివానంద చారి తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన శివానంద చారికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు, అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.





# గండ్రాయిలో వైభవంగా జీవధ్వజ, విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

## - భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన సామినేని విమలభాను

## - పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు, భక్తులు

**గండ్రాయి, జూన్ 24 (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో బుధవారం ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. గ్రామంలో వెలసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి, శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వారి జీవధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మరియు నభిశిల (బొడ్డురాయి) పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో సామినేని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివార్లను, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గండ్రాయి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, అలాగే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆ భగవంతుడిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల శాంతిసౌఖ్యాలు వెల్లివిరుస్తాయని ఆమె పేర్కొన్నారు. గ్రామ దేవతల పునఃప్రతిష్ఠ కార్యక్రమం కావడంతో గండ్రాయి గ్రామం అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ మహోత్సవంలో సామినేని విమలభాను ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులయ్యారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ చేశారు.



# బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట

## షరతులతో కూడా బెయిల్ మంజూరు

**హైదరాబాద్,జూన్24 (ప్రజా వీక్షణం)**

సింగరేణి సంస్థ మరియు దాని యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలనే నిబంధనపై బెయిల్ లభించింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ భయం లేకుండా ఈ బెయిల్ నిర్ణయం ఆయనకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.

# పలగిరి అంగన్‌వాడీ కేంద్రంలో కరువైన మౌలిక వసతులు

- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో చిన్నారులు, సిబ్బంది
- అధ్వానంగా మారిన 'స్వచ్ఛభారత్' మరుగుదొడ్డి
- కాలకృత్యాల కోసం బయటకు వెళ్తున్న 0-6 ఏళ్ల పిల్లలు

**పలగిరి, జూన్ 24 (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం పలగిరి గ్రామంలోని అంగన్‌వాడీ-1 కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రం మౌలిక వసతులు కరువయ్యాయి. పాలకుల నిర్లక్ష్యానికి ఈ కేంద్రమే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ మిషన్ మరుగుదొడ్డి నిర్వహణ కరువై పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో ఈ కేంద్రంలో పనిచేసే అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలతో పాటు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 0 నుండి 6 ఏళ్ల లోపు వయసున్న పసిపిల్లలు మల, మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారులు చేతుల్లో వాటర్ బాటిళ్లు పట్టుకుని కాలకృత్యాల కోసం బయటకు వెళుతుండటం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.కేంద్రంలో కనీసం తాగడానికి, వాడుకోవడానికి సరైన మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఒకపక్క వసతులు లేక, మరోపక్క తాగునీరు అందక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అస్తవ్యస్త పరిస్థితుల వల్ల తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడానికి తల్లిదండ్రులు ఎంతమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా కేంద్రంలో పిల్లల హాజరు శాతం కూడా క్రమంగా తగ్గుతోంది.ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలి. అంగన్‌వాడీ కేంద్రంలో కరువైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు, మరుగుదొడ్డిని ఆధునీకరించి, మంచినీటి సౌకర్యం కల్పించాలి. చిన్నపాటి మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి చిన్నారుల ఇబ్బందులను తొలగించాలని అన్నారు.




# దొడ్డ దేవరపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**దొడ్డ దేవరపాడు జూన్ 24 (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామంలో విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, బోధనా విధానాలపై ప్రత్యేక సమీక్షవీరులపాడు మండలం దొడ్డ దేవరపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారంఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించి, విద్యార్థుల విద్యాభ్యాసంపై ఆరా తీశారు అనంతరం పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్య అందించేందుకు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులతో సమావేశమైన ఆమె, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేలా ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి రాజీ పడకుండా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు మరియు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.





# ఒంటరి దివ్యాంగురాలిపై అత్యాచారం


## దుండగుడి కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్,జూన్24 (ప్రజా వీక్షణం)**

నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినికిడి శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# చింతలపూడి నియోజకవర్గ జనసేన సీనియర్ మెంబర్‌గా మోటేపల్లి సుబ్రహ్మణ్యం నియామకం




**చింతలపూడి, జూన్ 24:(ప్రజా వీక్షణం)**

జనసేన పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సెక్రటరీ మోటేపల్లి సుబ్రహ్మణ్యంకు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో చింతలపూడి నియోజకవర్గ సీనియర్ మెంబర్‌గా ఆయన నియమితులయ్యారు.ఇకపై చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం, బూత్ కమిటీల పటిష్ఠత, క్షేత్రస్థాయి సమాచార సేకరణ బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, వేగవరం గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన జనసేన అధిష్ఠానం ఈ ప్రాముఖ్యమైన బాధ్యతలను అప్పగించింది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకు, చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నా వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. నాపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు.మోటేపల్లి సుబ్రహ్మణ్యంకు కీలక పదవి దక్కడం పట్ల చింతలపూడి నియోజకవర్గ జనసైనికులు, వీరమహిళలు, మరియు పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఆయన నియామకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

# పారిజాతగిరి ఈవోగా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వి. చందన బాధ్యతల స్వీకరణ








**లిజంగారెడ్డిగూడెం జూన్ 24(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారి (ఈవో)గా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానం, గుర్వాయిగూడెం) ఆర్.వి. చందన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఈవో కలగర శ్రీనివాస్ నుండి ఆర్.విచందన బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆర్.వి. చందనకి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లూరి రామకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెరిచర్ల జగపతి రాజు, మరియు అర్చకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బాధ్యతలు చేపట్టిన నూతన ఈవో ఆర్.వి. చందనకు, అలాగే బదిలీపై వెళ్తున్న మాజీ ఈవో కలగర శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, కుమార్ ఆచార్యులు, రాఘవ ఆచార్యులు వేద ఆశీర్వచనాలతో శ్రీస్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్నప్రగడ వీరరాఘవరావు, కొప్పుల నాగ సురేంద్ర, వడిగళ్ల కుమారి, ముప్పిడి భాను, ఆరెపల్లి నాన్ని, అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, దండు ధనరాజు, గొట్టుముక్కల భాస్కర్ రాజు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయికృష్ణ అదృశ్యం కేసులో సిబిఐ విచారణ

## హైకోర్టులో పిల్ దాఖలు...సిట్ దర్యాప్తుపై ప్రభుత్వ వివరణ

## విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

**అమరావతి,జూన్24 (ప్రజా వీక్షణం)**

విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో సంచలనంగా మారింది. దర్యాప్తులో అసలు న ఇజాలు వెలికి రావడం లేదు. అసలు సాయికృష్ణ ఏమయ్యాడనే దానికి సమాధానం దొరకడం లేదు. ఈ కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు దర్యాప్తు పురోగతిని వివరించారు. ఈ కేసు సమగ్ర దర్యాప్తు కోసం ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏజీ ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పారదర్శకంగా, సక్రమంగా సాగేందుకు ప్రభుత్వం అన్నిరకాల కఠిన చర్యలు తీసుకుందని ఏజీ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని, బుధవారం ఆయనను కోర్టు ముందు హాజరుపరుస్తామని ఏజీ హైకోర్టుకు స్పష్టం చేశారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు విన్న న్యాయస్థానం.. సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో, నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో, ఏం చేస్తారో వేచి చూద్దామని వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది. సిట్ విచారణలో సీఐ నాగరాజు నోరు విప్పని నేపథ్యంలో, ఆయన అరెస్ట్ కావడం, కోర్టు ముందు హాజరు పరుస్తుండటంతో ఈ కేసులో మరిన్ని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

# మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి,జూన్24 (ప్రజా వీక్షణం)**

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ ఎగువన కొలువైన శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. పానకాల స్వామి వారికి పట్టువస్త్రాలతోపాటు పానకం నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ గారికి ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాద్యాలతో స్వాగతం పలికారు.



# సాయికృష్ణది కస్టోడియల్ డెత్

## - డెడ్‌బాడీని మాయం చేసేశారు- వారెంట్ ఉన్నా కోర్టులో హాజరు పర్చలేదు
## - సస్పెండయిన సిఐ నాగరాజ్ కనుసన్నల్లోనే హత్య
## - సాయికృష్ణ కేసులో కోర్టుకు సిట్ రిమాండ్ రిపోర్ట్

**విజయవాడ,జూన్24 (ప్రజా వీక్షణం)**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసు మిస్టరీకి అధికారికంగా తెరపడింది. ఈ కేసులో అరెస్టయిన సీఐ నాగరాజును రిమాండ్ రిపోర్ట్‌తో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాయికృష్ణది సాధారణ మిస్సింగ్ కేసు కాదని, అది కస్టడీయల్ డెత్ కేసుగా పేర్కొంటూ దర్యాప్తు బృందం కోర్టుకు నివేదిక సమర్పించింది. బుధవారం విజయవాడ 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు నిందితుడు సీఐ నాగరాజును హాజరుపరిచిన సిట్ అధికారులు.. దర్యాప్తులో వెలుగుచూసిన పలు కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాయికృష్ణది కస్టోడియల్ డెత్ అని, అతడి డెడ్‌బాడీని మాయం చేశారని సిట్ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక విషయాలను వెల్లడించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నా కోర్టులో హాజరుపర్చలేదని సిట్ వెల్లడించింది. గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు పూర్తికావడంతో 2వ ఏజేఎస్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్.. రిమాండ్ రిపోర్టును సమర్పించింది. సాయికృష్ణను నాన్ బెయిలబుల్ వారెంట్‌లో తీసుకువచ్చి మాయం చేశారు. మే 5 నుంచి జూన్ 19 మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. 17 మంది సాక్షులను విచారణ చేశాం. ఫోరెన్సిక్ బృందం సాయంతో సీసీ కెమెరా ఫీడు స్వాధీనం చేసుకున్నాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో హిమజ అనే స్టేషన్ సిబ్బందిని విచారించాం. కృష్ణలంక పోలీస్టేషన్‌లో సీసీపుటేజీ డేటా సిస్టమ్‌లో లేదు. సాయికృష్ణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌లోనే చూసినట్లు ఎస్ఐ వాంగ్మూలం ఇచ్చారు. మే5 నుంచి మే8 మధ్య సాయికృష్ణని కృష్ణలంక పీఎస్‌లో చూసినట్టు ఎస్ఐ వాగ్మూలం ఇచ్చారు' అని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. సాక్షాలను నాశనం చేయడానికి , పోలీసు కస్టడీలో లేకుండా పోవడానికి సీఐ నాగరాజే కారణం. సీసీపుటేజ్ డేటా 1-5-26 నుంచి 1-6-26 వరుకు డీవీఆర్‌లో లేకుండా చేశారు. ఫోరెన్సిక్ బృందానికి పరీక్ష కోసం డీవీఆర్‌లను పంపించాం. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మెజిస్ట్రేట్‌కు చేరవేయలేదు. సాయికృష్ణ మరణించాడని అతని తల్లి స్టేషన్‌కు వెళితే సీఐ నాగరాజు దూషించాడు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ వేసినా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదు. హైకోర్ట్ ముందు నిజాలు దాచారు , కోర్ట్‌ను తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలన్నీ గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశాడని గుర్తించాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆధారాలు పూర్తిగా ధ్వంసం చేశారు. అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందుతుడైన నాగరాజును విచారించాల్సి ఉంది. జూన్ 2 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని మేము విశ్వస్తున్నాం. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయి' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ వెల్లడించింది. చివరకు సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేశారని సిట్ నిర్ధారించింది. సిట్ తరపున వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది ప్రకారం.. గత నెల 8న మార్కాపురంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాదె సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నాన్-బెయిలబుల్ వారెంట్ ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరచలేదని తెలిపారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పేర్కొన్నారు. దర్యాప్తులో సాయికృష్ణ పోలీసుల అదుపులో ఉండగానే మృతి చెందినట్లు ఆధారాలు లభించాయని సిట్ కోర్టుకు వెల్లడించినట్లు తెలుస్తోంది. అంతేకాక, మరణం అనంతరం అతడి మృతదేహాన్ని కూడా మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేసు తీవ్రత మరింత పెరిగింది. అయితే సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణలకు ఆధారాలేమిటని న్యాయమూర్తి ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి స్పందించిన దర్యాప్తు వర్గాలు.. కేసుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, తన కుమారుడు కనిపించడం లేదంటూ సాయికృష్ణ తల్లి ఇప్పటికే హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ, సిట్ దర్యాప్తు, తాజాగా కోర్టులో వెల్లడైన అంశాలు కేసును మరింత కీలక దశకు తీసుకెళ్లాయి. నాగరాజు రిమాండ్ రిపోర్టులో నమోదైన అంశాలు, సిట్ కోర్టుకు సమర్పించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

## - దుష్ప్రచారాన్ని నమ్మవద్దు : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**అమరావతి,జూన్ 24 (ప్రజా వీక్షణం)**

సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను అన్నారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా తమకు లేదని అన్నారు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5వేల భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు, పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదని, నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే అని స్పష్టం చేసారు.
సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని స్పష్టం చేసారు. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం.




కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదని అన్నారు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం కూటమి ప్రభుత్వం, దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు.

# బుట్టాయిగూడెంలో పెద్దపులి కలకలం: రెండు ఆవుల మృతి!


## - మళ్లీ మొదలైన పులి పంజా ..
## - అటవీ శాఖ నిర్లక్ష్యంపై గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం





**బుట్టాయిగూడెం (ఏలూరు జిల్లా)జూన్ 24(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలంలో పెద్దపులి సంచారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని పాలకుంట గ్రామంలో పెద్దపులి దాడి చేయడంతో



రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వరుసగా జరుగుతున్న పులి దాడులతో అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారు. పాలకుంట గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లిన స్థానిక రైతులు కూరం వెంకటేశ్, సోయం వెంకటేశ్‌లకు చెందిన రెండు ఆవులపై పెద్దపులి ఒక్కసారిగా దాడి చేసి చంపేసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. పెద్దపులి దాడి ఘటనపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇదే పులి దాడి చేసి పలువురు రైతులకు చెందిన అనేక ఆవులను, పశువులను పొట్టనబెట్టుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా నిఘా పెట్టాలని, పులిని పట్టుకోవాలని గతంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈరోజు మళ్లీ మా పశువులు బలయ్యాయి. రేపు మా ప్రాణాలకు గ్యారెంటీ ఏంటి?" అంటూ అటవీ సిబ్బందిపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు పులి కదలికలను అటవీ శాఖ నిరంతరం గమనిస్తోందని డీఎఫ్ఓ సందీప్ తెలిపారు. పులికి అమర్చిన రేడియో కాలర్ ట్రాకర్ ఆధారంగా అది ప్రస్తుతం రామన్నగూడెం అటవీ ప్రాంతం వైపు పయనిస్తున్నట్లు సిగ్నల్స్ ద్వారా గుర్తించామని ఆయన వెల్లడించారు. పులి సంచార నేపథ్యంలో అటవీ సరిహద్దు గ్రామాల్లో మైకుల ద్వారా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. - గ్రామస్తులు ఎవరూ ఒంటరిగా అడవుల వైపు, పొలాల వైపు వెళ్లకూడదు. - పశువుల కాపరులు పశువులను అటవీ ప్రాంతాల్లోకి మేతకు తీసుకెళ్లవద్దు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదు, వచ్చినా గుంపులుగా టార్చ్ లైట్లతో రావాలి అంటూ తెలియజేసారు. ఈసారైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పులిని బంధించి, తమకు శాశ్వత విముక్తి కల్పించాలని, నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని పాలకుంట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వైకాపా హయాంలోనే పోలవరం కట్టల మట్టి లూటీ

## - విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపణలు

**విజయవాడ,జూన్24 (ప్రజా వీక్షణం)**

వైకాపా హయాంలోనే పోలవరం కట్టల మట్టి లూటీ జరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపించారు. అప్పటి అక్రమాలకు సంబంధించిన ఫొటోలను చూపిస్తూ.. కట్టు కథనాలతో సాక్షిపత్రిక అడ్డంగా దొరికిపోయిందని విమర్శించారు. పోలవరం కుడికాలువ కింద 2కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని దోచేశారని, దీనిపై 2022లోనే నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ కేసు కూడా నమోదైందని అన్నారు. కానీ, ఇప్పుడేదో జరిగిపోయిందని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫేక్ నాయకులు, ఫేక్ పార్టీ చేసే ఫేక్ ప్రచారంతో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలను చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం కుడి కాలువ కింద 2 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి దోచేశారనటానికి తన దగ్గర ఆధారాలు ఉన్నాయన్న కేశినేని చిన్ని.. దమ్ముంటే సీబీఐ, ఈడీ విచారణకు వైకాపా నేతలు సిద్ధపడాలని సవాల్ చేశారు.

# గట్టు లక్ష్మీనరసింహస్వామి సేవలో జగన్

## - ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ సిఎం

**పులివెందుల,జూన్24 (ప్రజా వీక్షణం)**

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్.. వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్.. గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోగానే అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. కలశ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, ఆలయంలో స్వామివారికి నిర్వహిస్తున్న సుదర్శన హోమంలోనూ పాల్గొన్నారు. ఆలయ కార్యక్రమం అనంతరం సమీపంలోని బండలాగుడు మైదానానికి చేరుకుని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించనున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.



# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

## సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు
## పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర
## మీడియా సమావేశంలో అంబటి రాంబాబు

**గుంటూరు,జూన్24 (ప్రజా వీక్షణం)**

ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు. నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డిఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయనే. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్‌లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారలాడారు. ఏ పోలీస్ పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్టు చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజును లాకప్‌లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కల్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హెచ్చరిక

- కలెక్టరేట్‌లో ఘనంగా 'దిశ' సమావేశం
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ వెట్రి సెల్వి, ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరు, జూన్ 24:(ప్రజా వీక్షణం)

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కేంద్ర మంత్రితో మాట్లాడి కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఏలూరు కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎంపీ మహేష్ కుమార్ ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ ప్రాజెక్టులపై అధికారులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని రహదారుల దుస్థితిపై ఎంపీ, కలెక్టర్లు అధికారులను నిలదీశారు. గ్రామీణ



ప్రాంతాల్లో కొత్తగా మంజూరైన రోడ్ల వివరాలను, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రానున్న పవిత్ర గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, ఆయా ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆదేశించారు. అలాగే జిల్లా పరిధిలోని రైల్వే శాఖకు సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టుల స్థితిగతులపై ఎంపీ మహేష్ కుమార్ ఆరా తీశారు. ముఖ్యంగా 'అమృత్ భారత్' పథకం కింద ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏలూరు రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం, ఆధునీకరణ పనుల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఏలూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. నాసిరకం పనులు చేస్తూ తీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదు. కేంద్ర రైల్వే శాఖ మంత్రితో



నేరుగా మాట్లాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా సిఫార్సు చేస్తాం అంటూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. సకాలంలో, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల సమస్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా!

ఏలూరు, జూన్ 24:(ప్రజా వీక్షణం)

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి, యార్డులలో పడిపోయిన కొనుగోలు ధరలపై తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఏలూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఏలూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో చింతలపూడి, పోలవరంతో పాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి వచ్చిన పొగాకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పొగాకు యార్డులలో కొనుగోలు ధరలు ఒక్కసారిగా పడిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని, మద్దతు ధర లభించేలా చూడాలని వారు ఎంపీని కోరారు. రైతుల వినతులపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. రేపు జరగబోయే పొగాకు బోర్డు సమావేశంలో ఏలూరు జిల్లా పొగాకు రైతుల సమస్యలను, ధరల పతనం అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తానని చెప్పారు. అలాగే రైతులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వం. బోర్డు అధికారులతో మాట్లాడి మార్కెట్‌లో పొగాకుకు తగిన న్యాయమైన ధర లభించేలా గట్టిగా కృషి చేస్తాం అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలువురు ప్రముఖ రైతు నాయకులు, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలకు చెందిన పొగాకు పండించే రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# వెంకటేశ్వర స్వామి చిత్రం అదుర్స్..

దేవరకద్ర జూన్ 24 ప్రజా వీక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని గ్రామానికి చెందిన ఆనందు కవిత కోడలు మీనా రంగవల్లికతో వేసిన వెంకటేశ్వర స్వామి చిత్రం ఎంతో అదుర్స్ గా ఉన్నది. సాక్షాత్ వెంకటేశ్వర స్వామి కండ్లకు అద్దం పట్టేలా ఉన్నది. ప్రతి సంవత్సరము అధికమాసంలో తమ ఇంటిలో వెంకటేశ్వర స్వామి పూజ సమయంలో ఇలాంటి చిత్రాలు వేయడం జరుగుతుందని వారు తెలిపారు. రంగవల్లికతో వేసిన వెంకటేశ్వర స్వామి చిత్రము పలువురిని ఎంతో ఆకట్టుకున్నది.






# సర్వేలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: జంగారెడ్డిగూడెం తహసిల్దార్ స్లీవ జోజి హెచ్చరిక

జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా):లిజూన్ 24(ప్రజా వీక్షణం)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని జంగారెడ్డిగూడెం తహసిల్దార్ స్లీవ జోజి స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ సర్వే ప్రగతిపై బూత్ స్థాయి అధికారులతో (బిఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారములను అందించి, నిర్దేశిత గడువులోగా పూర్తి వివరాలను సేకరించాలని బీఎల్‌ఓలకు దిశానిర్దేశం చేశారు. సర్వే అనేది అత్యంత కీలకమైన బాధ్యత. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, కాలయాపన చేసినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం అంటూ స్లీవ జోజి తహసిల్దార్ తెలిపారు. గడువు ముగిసేలోగా వంద శాతం సర్వే పూర్తి చేయాలని, ఎక్కడా ఎటువంటి తప్పులకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ద్వారక తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దంపతులు

ద్వారకాతిరుమల, జూన్ 24:(ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు, వారి సతీమణితో కలిసి బుధవారం 'చిన్న తిరుపతి'గా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. దర్శనానంతరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మీడియాతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు, యువత, మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలి. ప్రజల సంక్షేమం, శాంతి, సుభిక్షం కోసం శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆ వేంకటేశ్వర స్వామిని వేడుకున్నాం అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.






# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం!

- చిన్నారుల సంక్షేమంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్
- అంగన్‌వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు, అధునాతన వంట సామాగ్రి కిట్ల పంపిణీ
- పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం

పెదపాడు, జూన్ 24:(ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, చిన్నారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం పెదపాడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నూతనంగా కేటాయించిన అధునాతన ఇండక్షన్ స్టవ్‌లను, నాణ్యమైన వంట సామాగ్రి కిట్లను అంగన్‌వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు ఎంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో వంట వండి వడ్డించాలనేదే





ప్రభుత్వ సంకల్పమన్నారు. గ్యాస్ కొరత లేదా ఇతర ఇబ్బందుల వల్ల చిన్నారుల భోజన సదుపాయాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ సరికొత్త వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇండక్షన్ స్టవ్‌ల వాడకం ద్వారా పొగలేని, పర్యావరణ హిత వాతావరణంలో వంట వండే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది చిన్నారుల సంక్షేమం పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదు అంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆధునిక వసతులను అంగన్‌వాడీ సిబ్బంది సద్వినియోగం చేసుకుని, చిన్నారులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. తమ కేంద్రాల ఇబ్బందులను గుర్తించి, ఆధునిక వంట సామాగ్రిని అందించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 26న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 19వ వ్యవస్థాపక దినోత్సవం

## - ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ








తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 24 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 26న ప్రాంగణంలోని క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు భారీపరిశ్రమల శాఖ సహాయ మంత్రి, నరసాపురం పార్లమెంటు సభ్యులు భూపతిరాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వీరితోపాటు విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు ఈ కార్యక్రమానికి భారీగా హాజరు కానున్నారు.

### ఉద్యాన విశ్వ విద్యాలయం ఏర్పాటు ఇలా....

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చొరవతో వ్యవసాయ రంగం నుంచి ఉద్యాన రంగాన్ని వేరుచేసి 2007 జూన్ 26న ఆంధ్ర ప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేశారు. తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో 2012 సంవత్సరంలో డాక్టర్ వైయస్. రాజశేఖర రెడ్డి గౌరవార్థం డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో స్థాపించబడిన ఈ విశ్వ విద్యాలయం దేశంలోనే రెండవ ఉద్యాన విశ్వ విద్యాలయంగా ఘనతకెక్కింది. రాష్ట్ర విభజన క్రమంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న మొక్కవోని సంకల్పంతో గత 19 ఏళ్లుగా ఉద్యాన విద్య, పరిశోధన, విస్తరణ రంగాల్లో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉద్యాన రైతుల సేవలో తరిస్తూ వారికి విశేష సేవలు అందిస్తోంది.

### ఉద్యాన కళాశాలలు ఇలా...

ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం పరిధిలో 5 ఉద్యాన కళాశాలలు, 4 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు, 20 పరిశోధనా కేంద్రాలు, 4 కృషి విజ్ఞాన కేంద్రాలున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు అనువైన ఉద్యాన పంటలపై శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు నిర్వహిస్తూ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ ఉద్యాన రంగ రైతులకు ఆయువు పట్టుగా నిలుస్తోంది.

### నూతన వంగడాలు....

విశ్వవిద్యాలయం ఇప్పటి వరకు 34 నూతన ఉద్యాన వంగడ రకాలను అభివృద్ధి చేసి విడుదల చేసింది. 2022-23లో 13 సీవీఆర్సీ, 10 ఎస్వీఆర్సీ రకాలు, 2023లో మరో ఐదు సీవీఆర్సీ రకాలను విడుదల చేసింది. విశ్వ విద్యాలయం ఇప్పటి వరకు కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రం, తాటి ఉత్పత్తుల విలువ జోడింపు సాంకేతికత, జీడిమామిడి ఆపిల్ జ్యూస్ ప్రాసెసింగ్‌కు సంబంధించి మూడు పేటెంట్లు సాధించింది.

### అవార్డులిలా...

భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) నుంచి 'ఏ' గ్రేడ్ గుర్తింపు పొందిన ఈ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకుంది. విస్తరణ విభాగంలో ఉత్తమ సంస్థ అవార్డు, నైపుణ్యాభివృద్ధి అవార్డులతో పాటు విశ్వవిద్యాలయం పరిధిలోని పలు పరిశోధన కేంద్రాలు జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. జాతీయ స్థాయిలో అనేకమంది విద్యార్థులు ఫెలోషిప్ లు సాధించడంతో పాటు అనేక మంది విద్యార్థులు ఉన్నతాధికారులుగా, ఉద్యాన అధికారులుగా, ఫీల్డ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. పలువురు విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. కొందరు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తూ ఎంతోమందికి జీవనోపాధి కల్పిస్తుండటం విశేషం.

### వీసీ టూ విలేజ్...

రైతుల కోసం ఉద్యాన మిత్ర, ఉద్యాన వాణి, రైతు సలహా కేంద్రం, డిజిటల్ విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. 'వీసీ టు విలేజ్' కార్యక్రమం ద్వారా 127 గ్రామాలను దత్తత తీసుకుని రైతులకు సాంకేతిక సేవలు అందిస్తున్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ విజయాలను ప్రతిబింబించే ప్రత్యేక వీడియో ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభావంతులకు సత్కారంతో పాటు విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు పురస్కారాల ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి, డాక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామని వివరించారు.

# నూతన ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటు కు స్థల పరిశీలన చేసిన పోలీస్ కమిషనర్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం సుబేదారి పోలీస్ స్టేషన్ ఆవరణలోని మహిళా పోలీస్ స్టేషన్-1ను సందర్శిం చి, నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫ్యామిలీ కౌన్సి లింగ్ కేంద్రానికి సంబంధిం చిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం గా కేంద్రం నిర్వహణకు అవ సరమైన మౌలిక వసతులు, సదుపాయాలు, కార్యాచరణ అంశాలపై సంబంధిత అధి కారులతో చర్చించి పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వరంగల్ రంగం పేటలోని మహిళా పోలీస్ స్టేషన్2లో ప్రస్తుతం కొన సాగుతున్న ఫ్యామిలీ కౌన్సి లింగ్ కేంద్రాన్ని సందర్శించా రు. కేంద్రం నిర్వహణ విధా నం, కేసుల పరిష్కార ప్రక్రియ నిర్వహిస్తున్న రికార్డులు, నమోదు పుస్తకాలను పరి శీలించి అధికారులను వివ రాలు అడిగి తెలుసుకున్నా రు. కౌన్సిలర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పని తీరు, బాధ్యతలు, కేంద్రం ద్వారా అందిస్తున్న సేవల గురించి పోలీస్ కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అదన పు డీసీపీ బాలస్వామి, ఏసీ పీ సదయ్య, మహిళా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, సూర్యప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత, సుబే దారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, సర్వోదయ కార్యదర్శి డా. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 24 (ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. తెదేపా నియోజకవర్గ సమావేశాన్ని స్థానిక కార్యాలయంలో ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు వంటి అంశాల్లో నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. తెదేపా జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉండటం మనందరి అదృష్టమని, దేశానికే ఆదర్శమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రశంసించారు. వారంలో నాలుగు రోజులు తాను ప్రజాలతోనే ఉంటూ పార్టీ అధిష్టానం నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, వట్టూరి రాంబాబు, ముప్పిడి రమేష్, కాకర్ల సుభద్ర తదితరులు పాల్గొన్నారు.






# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## - జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

## - జీడబ్ల్యూఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు, నాలాల పూడికతీత, తాగునీటి సరఫరాపై సమీక్ష

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో చేపడుతున్న అభి వృద్ధి పనులను నిర్దేశిత గడు వులోగా పూర్తి చేయడంతో పాటు, ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జీడ బ్ల్యూఎంసీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైన్ ల పూడికతీ త తదితర అంశాలపై అధికారులతో సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెండర్లు పూర్తయి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేసి పనులు ప్రారంభించేలా చర్య లు తీసుకోవాలని సూచించా రు. ఇప్పటికే పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కుని నగరంలోని ప్రధాన,ఉప డ్రైనేజీల పూడికతీత పనుల ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాల ని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాద ని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కొత్తగా కమర్షియ ల్ గృహ



నల్లా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత సమయంలో కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదే శించారు. నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్త కుండా అధికారులు నిరంత రం పర్యవేక్షణ కొనసాగించా లని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపా యాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాల్లో అధి కారులు సమన్వయంతో పనిచేసి నగర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం లో బల్దియా ఎస్ఈ రాజ్‌కు మార్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, మాధవి, సంజయ్, డీఈలు, ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాజీ హోంమంత్రి తానేటి వనితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 24 (ప్రజా వీక్షణం)



మాజీ హోంమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు తానేటి వనిత పుట్టినరోజు సంధర్భంగా వైఎస్సార్ సీపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ఆదేశాల మేరకు బుధవారం పట్టణ అధ్యక్షుడు గొర్రెల శ్రీనివాసరావు, నాయకులు మాకరాజు సతీష్, రెడ్డి శ్రీను, బండి నర్సి పుష్ప గుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)




తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఖూజ సివిల్ సర్వీసెస్ (జూాూ) 2026– 27 ప్రిలిమినరీ పరీక్షకు ఉచి త శిక్షణ అందించను న్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ నిరుద్యోగ అభ్యర్థు లు జూలై 12 వరకు దరఖా స్తు చేసుకోవచ్చన్నారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని వారు అర్హులు. జులై 19న ప్రవేశ పరీక్ష నిర్వహించ గా, మెరిట్ సాధించిన వారికి హైదరాబాద్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయా లతో శిక్షణ అందించనున్న ట్లు తెలిపారు. దరఖాస్తులు ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు.



# వన మహోత్సవంలో మొక్కలు నాటాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో వన మహోత్స వం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమావేశం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)

వన మహోత్సవం కార్య క్రమంలో భాగంగా గ్రామాల లో వివిధ రకాల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టా లని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బుధవారం హను మకొండ జిల్లా కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో వివిధ శాఖల జిల్లా అధికారు లు, ఎంపీడీవోలు ఎంపీఓల తో వన మహోత్సవం, ఇంది రమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, టాయిలెట్ల నిర్మా ణం, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అధికారుల కు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, డిపిఓ లక్ష్మీ రమాకాం త్, పంచాయతీరాజ్ ఇంజ నీరింగ్ ఈఈ సైదుల్ రెడ్డి, అడిషనల్ డి ఆర్ డి ఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.





# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు
మోపిదేవిలో ప్రత్యేక పూజలు
కొక్కిలిగడ్డ జడ్పీ పాఠశాల నేతన భవనానికి ప్రారంభం

మచిలీపట్టణం,జూన్24 (ప్రజా వీక్షణం)

అవనిగడ్డ నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మంత్రి.. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునే ముందు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. 'బాగున్నారా' అంటూ కరచాలనం చేశారు. 'లోకేశ్ అన్నా' అంటూ ప్రేమతో మంత్రిని స్థానిక ప్రజానీకం పలకరించింది.అనంతరం, వేద ఆశీర్వచనాలతో లోకేశ్‌కు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయి అర్చకులు స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి.. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని అందించి లోకేశ్‌ను అధికారులు సత్కరించారు. లోకేశ్ వెంట ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత దర్శించుకున్నారు.



# పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరి సహకారం అవసరం

- ఎస్ఐఆర్-2026 విజయవంతానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి
- డబుల్ ఓట్లపై చట్టపరమైన చర్యలు తప్పవు
- ఎస్ఐఆర్-2026పై మీడియా ప్రతినిధులతో అవగాహన సమావేశం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి






ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)

ఓటరు జాబితాను మరింత ప్రామాణి కంగా, పారదర్శకం గా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్య క్రమానికి ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐఆర్– 2026 అమలు విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఓటర్ల బాధ్యతలపై సమగ్ర వివరణ అందించారు. ఈ సంద ర్భంగా మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక ప్రజెంటే షన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారం పూరించే విధానాన్ని వివరించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కు సరైన సమాచారం చేర వేసే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఎస్ఐఆర్‌పై అపోహలు, అనుమానాలు తొలగించి అవగాహన పెం పొందించడంలో మీడియా సహకారం ఎంతో అవసరమ ని పేర్కొన్నారు. ప్రతి ఓటరూ ఈ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. జిల్లా లోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ముందస్తు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సానుకూల ఫలితాలను ఇచ్చిందన్నారు. వరంగల్ పశ్చిమలో 68 శాతం, పరకాలలో 87 శాతం మేర మ్యాపింగ్ పూర్తయింద ని తెలిపారు. స్పెషల్ ఇంటె న్సివ్ రివిజన్ (సర్)– 2026 లో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే హౌస్–టు–హౌస్ ఎన్యు మరేషన్ ప్రక్రియ నిర్వహిస్తా రని తెలిపారు. ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారమ్ అందజేసి, ఇంట్లో లేని వారిని కనీసం మూడు సార్లు సంద ర్శించా లని ఆదేశించారు.2002 ఓటరు జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో ఎటువంటి సహాయక పత్రాలు అవసరం లేదని, వివరాలు ధృవీకరించి సంత కం తీసుకుంటే సరిపోతుంద ని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉండే అవకాశం ఉన్నందున, ఫారమ్‌ల పంపి ణీ, సేకరణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. అర్బన్ ప్రాంతాల్లో షిఫ్టెడ్ ఓటర్లు, అద్దె నివాసితులు, కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేసి, అవసరమైతే ఫారమ్–8 ద్వారా బదిలీ చర్యలు చేపట్టాలని తెలిపా రు. 18 సంవత్సరాలు నిండి న అర్హులందరికీ ఫారమ్–6 అందించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని, మర ణించిన లేదా నివాసం మార్చిన ఓటర్ల వివరాలను తగిన ఆధారాలతో నమోదు చేయాలని, ఆధారాలు లేకుం డా ఏ పేరును తొలగించరాద ని స్పష్టం చేశారు. మరణించి న వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు, బహుళ ప్రాంతా ల్లో నమోదైన ఓట్లను గుర్తిం చి నిబంధనల ప్రకారం సవరి స్తామని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదు అయి ఉండటం లేదా తప్పు డు వివరాలు సమర్పించడం చట్టవిరుద్ధమని, సంబంధిత వ్యక్తులపై నిబంధనల మేర కు క్రిమినల్ చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు.
ఈసిఐ సెక్షన్ 31 ప్రకారం రెండుచోట్ల ఓటు హక్కు కలిగి వుండటం నేరమని, దీనికి సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతోందని అన్నారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరే ట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు, 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. సేకరించిన వివరాలను అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలో పేతం చేసేలా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందిం చడమే ఎస్ ఐ ఆర్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధు లు సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్ –2026 విజయవం తమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావే శంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్ఓ కె. శ్రీనివాస్, డీపీఆర్ఓ అయూబ్ అలీ, ఆర్డీవో వెంకటేష్, తహసీ ల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డ గుట్టలో అడ్డగోలు అక్రమ నిర్మాణాలు, కాసులకు కక్కుర్తి పడుతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కూకట్ పల్లి : జూన్ 24 (ప్రజా వీక్షణం )

నిబంధనలను ఎవరు అతిక్రమించినా, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని బల్లగుద్ది చెబుతున్న అధికారులు బల్లకింద చేతులు చాచి కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమ నిర్మాణ దారులకు వత్తాసు పలుకుతున్నారు . అక్రమ నిర్మాణ దారులకు అండ దండలు అందిస్తూ అందినకాడికి దండుకుంటున్నారనీ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు ఇష్టా రితిగా వసూళ్ల దందాలు చేస్తున్నారు . పట్టణ ప్రణా ళిక విభాగం అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణ నిర్మాణ దారులకు అడ్డదారిలో అనుమ తులు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా అడిగినంత ఇస్తే అన్నీ సక్రమమే అన్న విధంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. అవినీతిని పూర్తిగా నిర్మూలించేందుకు నూతన వ్యవస్థను తీసుకు వస్తాను అంటున్న ప్రభుత్వ ప్రకటనల తో అప్రమత్తమైన కొందరు అధికారులు నూతన నిర్మాణ దారులను వెతుకుతున్నారని సమాచారం. ఆ దిశగా సర్కిల్ 51 సిబ్బంది చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని నిర్మాణం దారులకు అనుమతులు మంజూరు చేస్తున్నారనీ స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్కిల్ 51 పరిధిలోని అడ్డగుట్ట తదితర ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ప్రజ లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణా లపై ఉన్నతాధికారులు సైతం ఎలాంటి ఊసే ఎత్తడం లేదు. అవినీతికి పాల్ప డుతూ అందినకాడికి దండుకుంటున్న వారిపై ప్రభుత్వం ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదు. జి ప్లస్ టు వరకు అనుమతులు తీసుకుని నాలుగు నుండి అంతస్థులు వరకు నిర్మాణం చేపడుతున్న సిబ్బంది ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదంటే ఏ మేరకు అవినీతి జరుగు తుందో... బల్దియా ఆదాయానికి ఎంత గండి కొడుతున్నారో ఇట్టే అర్థమవుతుంది. తూతూమంత్రంగా ఓవైపు తాత్కాలిక కూల్చివేతలు చేస్తూ మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు తెరలేపుతున్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని




నిర్మాణాదారుల పై కేసులు పెట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హనుమకొండలో మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)

కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయా ధారిత వ్యవస్థా పకత మంత్రిత్వ శాఖ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 27న హనుమకొండలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వ హించనున్నట్లు తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టీఆర్ఎల్‌డీ) రాష్ట్ర అధ్య క్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిల వాయి దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐటీ, ఫార్మా స్యూటికల్స్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన 100కు పైగా ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని చెప్పారు. జూన్ 27న ఉద యం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. జాబ్ మేళాలో పాల్గొనడానికి ఎలాంటి రుసుము లేదని స్పష్టం చేశారు. ఈ కార్య క్రమాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ వెంకట నారాయణ, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యేలు కె. నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు ప్రారంభించ నున్నట్లు తెలిపారు.అవినీతి రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో “లక్ష్యం కోసం లక్ష సైన్యం“ కార్యక్రమాన్ని ప్రారం భిస్తున్నట్లు వెల్లడించారు. రిటైర్డ్ ఆర్మీ




అధికారులు, మాజీ సైనికులు, దేశభక్తి భావాలు కలిగిన యువతను సమీకరించి సభ్యత్వ నమో దు చేపట్టనున్నట్లు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా టీ ఆర్ఎల్‌డీ అధికార ప్రతినిధి గౌర బీరప్ప మాట్లాడుతూ, రానున్న నల్గొండ– వరంగల్– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎల్‌డీ తరపున కపిలవాయి దిలీప్ కుమార్ పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో సహకరించిన రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలుపుతూ, రానున్న ఎన్నికల్లో కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమా వేశంలో టీఆర్ఎల్‌డీ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంప్రసాద్, యువజన విభాగం అధ్యక్షు డు రాంకుమార్ రెడ్డి, సాం స్కృతిక విభాగం అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, రాష్ట్ర కోశాధికారి గిరి కుందే, రాష్ట్ర కార్యదర్శి కోటి, ప్రధాన కార్య దర్శి నరసింహారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి

## జిల్లా అధికారి రమాదేవి గారికి వినతి పత్రం...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నూతన విద్యా సంవత్సరం 2026-27 ప్రారంభమైన నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ గిరిజన శాఖ అభివృద్ధి జిల్లా అధికారి రమాదేవి గారికి వినతిపత్రం అందజేశారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనేక ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు సోకకుండా అన్ని పాఠశాలలు, హాస్టళ్లలో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.అదేవిధంగా జిల్లాలోని కొన్ని ఆశ్రమ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షాల కారణంగా విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి సురక్షితమైన వాతావరణంలో విద్యను అందించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొన్ని పాఠశాలలు, హాస్టళ్లలో తాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని



విద్యాసంస్థల్లో నిరంతర తాగునీరు, విద్యుత్ సరఫరా కల్పించాలని కోరారు.అలాగే జిల్లాలో నిర్మాణంలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాల భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దుర్గం దినకర్ విజ్ఞప్తి చేశారు.

# డిపాజిట్ డబ్బులు వెంటనే చెల్లించాలి లేకపోతే ఆందోళనలు తప్పవు

### - ఆనంద్ కుమార్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి ఆరు నెలలు గడిచినప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్ పొందే అర్హత సాధించిన అభ్యర్థులకు ఇప్పటి వరకు వారి డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లించక పోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఎన్నికల నిబంధనల ప్రకారం తిరిగి ఇవ్వాల్సిన డిపాజిట్ మొత్తాలను అధికారులు అనవసరంగా జాప్యం చేయడం సమంజసం కాదు. ఈ నిధులను విడుదల చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి.డిపాజిట్ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల అధికారులు ఆ నిధులను ఇతర అవసరాలకు ఖర్చు చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వడంతో పాటు, డిపాజిట్ పొందే అర్హత ఉన్న అభ్యర్థులందరికీ వారి డబ్బులను తక్షణమే చెల్లించాలి.లేనిపక్షంలో సంబంధిత అధికారులను నిలదీస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నాము. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ అభ్యర్థులకు చెందాల్సిన నిధులను నిలిపివేయడం సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

# ఆడుదాం ఆంధ్రాలో వందకోట్ల దుర్వినియోగం

### - విచారణలో అన్ని విషయాలు బయటపెడతాం
### - రెండేళ్లలో క్రీడల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
### - గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ప్రోత్సాహం
### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.






**అమరావతి,జూన్ 24 (ప్రజా వీక్షణం)**

ఆడుదాం ఆంధ్రా' అక్రమాలపై విజిలెన్స్ నివేదిక త్వరలోనే బయటకు వస్తుందని క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రూ.100 కోట్లకుపైగా ఇందులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయన్న ఆయన.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరన్నారు. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ అమల్లో సూక్ష్మ లోపాలు కూడా లేవని తేల్చి చెప్పారు. క్రీడల కోటాలో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల .. గత రెండేళ్లలో 800 మందికి పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఖేలో ఇండియా పథకం నిధులు రూ.75 కోట్లతో రాష్ట్రంలో మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రెండేళ్లలో క్రీడలు, యువజన రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడలకు ప్రోత్సాహం అందించాం. సీఎం చంద్రబాబు సారథ్యంలో యువత, క్రీడాకారుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రీడాలు యువజన సేవల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత నిస్తూ అనేక కీలక కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. అమరావతి సచివాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన క్రీడా వ్యవస్థను పునరుద్ధరించి, మౌలిక వసతుల కల్పన, క్రీడాకారుల ప్రోత్సాహం, యువత సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. విజయనగరం విజ్జీ స్టేడియం, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పూర్తిచేసి ప్రారంభించామని తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రూ.75 కోట్లతో విజయవాడ, కుప్పం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, గుంటూరులో ఆధునిక క్రీడా మౌలిక వసతుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.5.60 కోట్ల నగదు ప్రోత్సాహకాలు అందించగా, వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 429 మంది క్రీడాకారులకు రూ.19 కోట్ల ప్రోత్సాహకాలు అందించినట్లు చెప్పారు. క్రీడాకారుల ఉద్యోగ రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడంతో రెండు సంవత్సరాల్లో 819 మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం చేపట్టామని, ఇప్పటివరకు 46 కేంద్రాలు పూర్తయ్యాయని, మరో 91 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లు, పారా బ్యాడ్మింటన్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ వంటి పలు జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 31 క్రీడా విభాగాల్లో లీగ్ పోటీలను నిర్వహిస్తున్నామని, విశాఖపట్నం,కాకినాడ, తిరుపతిలో మూతపడిన క్రీడా అకాడమీలను తిరిగి ప్రారంభించి 13 క్రీడా విభాగాల్లో శిక్షణ అందిస్తున్నామని వెల్లడించారు.యువజన సేవల విభాగం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉత్సవాలు, వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్, వ్యక్తిత్వ వికాసం కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి లక్షలాది మంది యువతకు ప్రయోజనం చేకూర్చినట్లు మంత్రి వివరించారు. ఆంధ్ర యువ సంకల్ప్ 2025 కార్యక్రమం ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించే వినూత్న ప్రయత్నం చేపట్టామని చెప్పారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళల భద్రత వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా 593 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 2,820 యువజన క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతలో నాయకత్వ లక్షణాలు, స్వచ్ఛంద సేవా భావాన్ని పెంపొందించామని వివరించారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు, జాతీయ యువజన దినోత్సవం, యువజన ఉత్సవాల ద్వారా యువతను సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేశామని తెలిపారు. క్రీడలు మరియు యువజన అభివృద్ధి ద్వారా రాష్ట్ర యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఏఓగా మోతె వేణు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మోతె వేణు పదోన్నతి పొంది పరిపాలనా ధికారి (ఏ ఓ)గా నియమితు లయ్యారు. ఈమేరకు ఆయ న బుధవారం నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో బాధ్యతలు స్వీకరించారు గతంలో భూపాలపల్లి జిల్లా టీఎన్‌జీవోస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలందిం చిన మోతె వేణు, ఉద్యోగ సంఘాల నాయకుడిగా అధి కారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు సహచరులు పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసుపత్రి పరిపాల నలో మెరుగైన సేవలు అందించడంలో ఆయనకీలక పాత్ర పోషిస్తారనే విశ్వాసా న్ని అధికారులు, ఉద్యోగులు వ్యక్తం చేశారు.ఈ సందర్భం గా ఎస్సీ, ఎస్టీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు ప్రసాద్, ఏడి సజిత్, ఓఎస్ రవీందర్, మోజుద్దీన్, ఏడి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, స్నేహితులు మోతె వేణును అభినందించారు. నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# నీట్ అక్రమాలపై కాగడా ర్యాలీ విద్యార్థులకు కాంగ్రెస్ అండ

### - ఎంపీ కడియం కావ్య

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

నీట్ పరీక్ష అక్రమాలు, ప్రశ్నా పత్రాల లీకేజీలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించి న కాగడా ర్యాలీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు జరిగిన ర్యాలీ అనంతరం మృతి చెందిన విద్యార్థులకు క్యాండిళ్లు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పోటీ పరీక్ష ల్లో జరుగుతున్న అక్రమాలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం దీనిపై సమాధా నం చెప్పాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు బల హీన వర్గాల విద్యార్థుల విద్యా హక్కులను కాపాడేం దుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పు డూ అండగా ఉంటుందని తెలిపారు.



# త్వరలో బీసీ రక్షణ చట్టం

### - బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,జూన్24 (ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్ బీసీల ఆత్మగౌరవం, రక్షణ, సామాజిక న్యాయం కోసం “బీసీ రక్షణ చట్టం-2026” చట్టం తీసుకొస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. కూటమి ప్రభుత్వం గడచిన రెండేళ్లలో శాఖాపరంగా చేపట్టిన ప్రగతిని సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటువంటి చట్టం తీసుకురావడం దేశంలోనే మొట్టమొదటిసారన్న మంత్రి ఈ చట్టంతో 138 బీసీ కులాలకు రక్షణ లభిస్తుందని అన్నారు. ఇప్పటికే బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధమైనట్లు పేర్కొన్నారు. బీసీ రక్షణ చట్టం కోసం బీసీ మంత్రులు ఇప్పటికే మూడు పర్యాయాలు సమావేశమయ్యారని, బీసీ రక్షణ చట్టం అసెంబ్లీలో ఆమోదం పొందగానే, కేంద్రానికి పంపించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్నూలు, ఏలూరు, నెల్లూరులో బీసీ భవనాలను మంజూరు చేశాం.ఒక్కో బీసీ భవనాన్ని రూ. రూ.7 కోట్లతో నిర్మిస్తున్నట్లు మంత్రి సవిత చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 కోట్లతో 48 బీసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2 ఏళ్లలో 117.68 లక్షల మంది బీసీ లబ్ధిదారులకు రూ.32,533.68 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఎ న్టీ ఆ ర్ భరోసా పెన్షన్ల కింద 2024-26 మధ్య 29,16,610 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.25,021.88 కోట్లు, దీపం -2 కింద 54,10,116 లక్షలకు బీసీ లబ్ధిదారులకు రూ.1,864.77 కోట్లు, ఎ . ీ జు రియింబర్స్ మెంట్ కింద 2025-26లో 1,17,034 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.911.51 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 30,38,564 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.3950.13 కోట్లు, ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 1,61,538 మంది ఆటో డ్రైవర్లకు రూ.242.31 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులుగా రూ.0.72 కోట్లను 558 మంది బీసీ విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు.సామాజిక వర్గీయులకు కేంద్ర ప్రభుత్వ సూచనతో సీఎం చంద్రబాబు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. వాటిలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు.. ఆ రిజర్వేషన్లను జగన్ రద్దు చేశారని గుర్తు చేసారు. 2014-19లో కాపు సామాజికవర్గ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో 13 కాపు భవనాలు, 487 మినీ కాపు భవనాల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక




# రంగస్థలం తరవాత అంతటి సినిమా పెద్ది

**ఎంతో కష్టపడితే తప్ప ఇంతగా ప్రేక్షకులు ఆదరించరు చరణ్ నటనను చూసి పుత్రోత్సాహం ఆస్వాదిస్తున్నా దర్శకుడు బుచ్చిబాబును అభినందించిన చిరు**

నటుడిగా ఎంతో పరిపక్వత, పరిపూర్ణతని ప్రదర్శిస్తున్న రామ్‌చరణ్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. తండ్రిగా గర్వపడుతున్నానని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో 'పెద్ది' విజయోత్సవం జరిగింది. రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. జాన్వీ కపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. ఈ వేడుకలో చిత్రబృందం, పంపిణీదారులు, ప్రదర్శనకారులకి జ్ఞాపికలు ప్రదానం చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'పెద్ది తరహా సినిమాలు రావాలి, పరిశ్రమ సుభిక్షంగా ఉండాలి. పెద్ది చూస్తూ భావోద్వేగానికి గురయ్యాను. అలాంటి అనుభూతినిచ్చే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. ఆ కథా ప్రపంచంలో లీనమై ఉద్వేగానికి గురయ్యాను. పాత్రలతోపాటు బాధని అనుభవించా. ఇంత శక్తిమంతమైన, భావోద్వేగమైన కథ, పాత్రలకు చరణ్ న్యాయం చేస్తారని నమ్మిన దర్శకుడు బుచ్చిబాబుకు కృతజ్ఞతలు. సుకుమార్ తీసిన 'రంగస్థలం' చూసి రామ్‌చరణ్ ఎంత బాగా చేశాడో అన్నారు. అలాంటి రంగస్థలం రావాలంటే ఎన్నేళ్లు పడుతుందో అనుకున్నాం. పెద్దిలాంటి సినిమా ఇంత తొందరగా వస్తుందని ఊహించలేదు. ఆ విషయంలో చరణ్ చాలా అదృష్టవంతుడు. తను ప్రేక్షకుల్ని అంతగా కట్టిపడేయడానికి కారణం పాత్రని కఠోరంగా నమ్మడమే ప్రతి ఒక్కరికీ ఓ ధ్యేయం ఉండాలి. ఆ లక్ష్యంవైపు వెళ్లేందుకు శారీరకంగా శ్రమించాలి. ఎలా కష్టపడాలో ఈ సినిమాతో రామ్‌చరణ్ నిరూపించాడు. అత్యున్నతమైన నటన అని ప్రేక్షకులు మెచ్చుకున్నారంటే దాన్ని మించిన పురస్కారం మరొకటి ఉండదన్నారు. ఇప్పుడు చిరంజీవికాదు... చరణ్‌జీవి. ప్రధానితో కలిసి ఈమధ్యే పాల్గొన్న ఓ కార్యక్రమంలో చరణ్‌ని న్యూ ఏజ్ మెగాస్టార్ అన్నారు.

# చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా ఎక్స్ వేదికగా చిరంజీవి ఆనందోత్సాహం

మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చిరంజీవి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.






# 'గాసిప్' సినిమా చూడాల్సిందే

మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెళ్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. 'ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఒక చిన్న గాసిప్ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో చూపించే కథ. దీన్ని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు నటి రాశీ సింగ్.



# వారణాసి షూటింగ్‌కు మహేశ్‌బాబు బ్రేక్ మళ్లీ జూలై1 నుంచి పాల్గొంటారని సమాచారం

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనుంది. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయి విజువల్స్, సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను పలు భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.





# బోనీకపూర్ ఇంట్లో పెళ్లి సందడి



బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి.గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా-రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు.

# మాట్లాడినా..మాట్లాడకున్నా తప్పే..అవుతోంది



ధర్మన్ సినిమా లాంచ్‌లో రజనీకాంత్ ఆవేదన తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు. ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజనీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు సూపర్‌స్టార్ రజినీకాంత్ బహిరంగంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై రజినీకాంత్ స్పందించారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com